సాక్షి నంద్యాల
బుధవారం । 27 । నవంబర్ । 2024



అన్న ప్రసాదానికి విరాళం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి మంగళవారం కర్నూలుకు చెందిన వడ్డే విశ్వనాథ్ రూ.1,10,116 విరాళం అందజేశారు.



నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో శనగన బసవన్నకు, బయలు వీరభద్ర స్వామికి మంగళ వారం ఆలయాధికారులు, అర్చకులు విశేష పూజలు చేశారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,630.15
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 94.626
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 3,287
అవుట్ ఫ్లో	: 6,968

న్యూస్‌రీల్

ప్రజాస్వామ్య పరిరక్షణలో రాజ్యాంగానిదే కీలకపాత్ర

- భారత రాజ్యాంగ దినోత్సవంలో జేసీ విష్ణుచరణ్



ప్రతిజ్ఞ చేస్తున్న జాయింట్ కలెక్టర్, అధికారులు

నంద్యాల: ప్రజాస్వామ్య పరిరక్షణలో భారత రాజ్యాంగం కీలక పాత్ర పోషిస్తుందని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో 75వ రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1949 నవంబరు 26న భారత రాజ్యాంగం ఏర్పాటైనప్పటికీ 1950 జనవరి 26 నుంచి పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చిందన్నారు. ప్రజల హక్కులను పరిరక్షించేందుకు, ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడేందుకు మన రాజ్యాంగం దోహదపడుతుందన్నారు. రాజ్యాంగ బద్ధంగానే అసెంబ్లీ, పార్లమెంట్లలో నూతన విధానాలను ప్రవేశపెట్టి ఆమేరకే అమలు చేయాల్సి ఉంటుందన్నారు. ప్రతి భారతీయుడు కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా స్వేచ్ఛగా తన భావాలను, అభిప్రాయాలను వెల్లడించగలుగుతున్నారంటే అది రాజ్యాంగం కల్పించిన గొప్ప హక్కు అని చెప్పారు. జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్ మాట్లాడుతూ రాజ్యాంగం దేశానికి దిక్సూచిగా పనిచేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, డీఎస్ఓ వెంకట్రాముడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, సీపీఓ వేణుగోపాల్ ఇతర జిల్లా అధికారులు, కలెక్టరేట్‌లోని అన్ని సెక్షన్ల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్ రెన్యువల్‌కు రిజిస్ట్రేషన్ చేసుకోండి

నంద్యాల(అర్బన్): జిల్లాకు చెంది ఇతర రాష్ట్రాల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాపు, ఈబీసీ, డిజేబుల్ విద్యార్థినీ విద్యార్థులు 2024–25 విద్యాసంవత్సరానికి గాను పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్ రెన్యువల్‌కు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ, సాధికారత అధికారిణి చింతామణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు https://jnanabhumiv2.apcfss.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకొని, ఆతర్వాత గ్రామ/వార్డు సచివాలయాల్లో విద్యా సంక్షేమ సహాయకుల లాగిన్ ద్వారా ఫైవ్ స్టెప్ వెరిఫికేషన్ పూర్తి చేయించుకోవాలని సూచించారు.

నిరుద్యోగికి దగా

- నిరుద్యోగ భృతి హామీని గాలికి వదిలేసిన కూటమి సర్కారు
- అధికారం కోసం ఎన్నికల ముందు ప్రకటన
- 2014లోనూ ఇదే తరహా మోసం
- మెగా డీఎస్సీ పేరుతో కాలయాపన
- ఆందోళనలో నిరుద్యోగులు
- బాబు మాయమాటలు నమ్మి మోసపోయామని ఆవేదన

కోవెలకుంట్ల: ఎన్నికలకు ముందు తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీలు కూటమిగా ఏర్పడి ఎన్నో హామీలు గుప్పించారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు/ నెలకు రూ. 3 వేల నిరుద్యోగ భృతి, స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ. 15 వేలు, అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ఏడాదికి రూ. 20 వేలు పెట్టుబడి సాయం, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ. 1500, ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమంటూ అధికారం చేజిక్కించుకుంది. ఆరునెలలవుతున్న ఏ ఒక్క హామీ అమలు చేయకుండా మోసం చేస్తుండటంతో వివిధ వర్గాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతిపై గంపెడు ఆశలు పెట్టుకున్న యువతకు చంద్రబాబు ప్రభుత్వం చుక్కలు చూపిస్తోంది. డీఎస్సీ, గ్రూప్స్, తదితర పరీక్షలన్నింటినీ వాయిదాల మీద వాయిదాలు వేస్తూ యువత భవిష్యత్‌తో చెలగాటమాడుతోంది. ఎన్నికల్లో ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీని సైతం గాలికొదిలేసింది. నిరుద్యోగులకు భృతి నందించే ప్రతిపాదనే ప్రభుత్వం వద్ద లేదని ఇటీవల జరిగిన అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వం రాత పూర్వకంగా తేల్చి చెప్పేసింది. రాష్ట్రంలో 4.46 లక్షల మంది మాత్రమే నిరుద్యోగులు ఉన్నట్లు కాకి లెక్కలు చూపిస్తోంది. నంద్యాల జిల్లాలోని 29 మండలాల పరిధిలో 5,95,045 మంది నిరుద్యోగులు ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించే వరకు నెలకు రూ. 3వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని కూటమి మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. తీరా గద్దెనెక్కి ఆరు నెలలు కావస్తున్నా ఆ హామీ అమలుపై ఒక్క అడుగూ ముందుకు పడలేదు. ఇటీవల ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో సైతం నిరుద్యోగ భృతికి ఎటువంటి కేటాయింపులు చేయకపోవడంతో యువత ఆందోళన చెందుతోంది.

2014లోనూ ఇదే తరహా మోసం

2014 ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు 600కు పైగా హామీలిచ్చి గద్దెనెక్కి ఏ ఒక్క హామీ అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను దగా చేశారు. నిరుద్యోగంపై ఒక అడుగు ముందుకేసి జాబు రావాలంటే బాబు రావాలి... ఇంటికో ఉద్యోగం, ఉద్యోగం వచ్చే వరకు నెలకు రూ. రెండు వేలు నిరుద్యోగ భృతి చెల్లిస్తామని కపట ప్రేమ ప్రదర్శించారు. ఎన్నికలకు ఆరు నెలల ముందు యువనేస్తం పేరుతో ముందుకొచ్చారు. ఉమ్మడి జిల్లాలో 75వేలకు పైగా నిరుద్యోగులు ఉంటే వివిధ నిబంధనలతో ఆ సంఖ్య 12 వేలకు కుదించి రూ. వెయ్యిచొప్పున నిరుద్యోగ భృతి చెల్లించి చేతులు దులుపుకున్నారు. దీంతో 2019 ఎన్నికల్లో యువతీ, యువకులు తెలుగుదేశం పార్టీకి గుణపాఠం చెప్పి ఆ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పట్టం కట్టారు. 2024 ఎన్నికల వేళ అధికారం కోసం మరోసారి నిరుద్యోగులకు నెలకు రూ. 3వేలు భృతి చెల్లిస్తామని నమ్మబలికి యువతీ, యువకుల ఓట్లు దండుకున్నారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు నిరుద్యోగ భృతి ఊసే లేకపోవడం విచారకరం.




- ఈ యువకుడు సంజామల మండలం అక్కంపల్లెకు చెందిన నాగేశ్వరరెడ్డి. బీటెక్ వరకు విద్యనభ్యసించాడు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు తాము అధికారంలోకి వస్తే ఇంటికో ఉద్యోగం లేదా నెలనెలా నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించారు. ఆరునెలలవుతున్నా హామీ నెరవేర్చకపోగా..జాబ్ క్యాలెండర్ సైతం అమలు చేయకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నాడు



- ఇతను కోవెలకుంట్ల మండలం కంపమల్లకు చెందిన వెంకటేశ్వరరెడ్డి. ఎంటెక్ పూర్తి చేశాడు. ప్రభుత్వ ఉద్యోగం రాకపోవడంతో వ్యవసాయం చేసుకుంటూ భార్య, కుమారుడిని పోషించుకుంటున్నాడు. కూటమి పార్టీల నాయకులు ఎన్నికల సమయంలో చదువుకున్న ప్రతి ఒక్కరికీ నెలకు రూ. 3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించడంతో నమ్మాడు. అధికారంలోకొచ్చి ఐదునెలలు గడిచినా ఇప్పటి వరకు అతీగతీ లేదని వాపోతున్నాడు.

జిల్లాలో మొత్తం నిరుద్యోగులు	5,95,045
ఒక్కొక్కరికి నెలకు ఇవ్వాల్సిన నిరుద్యోగ భృతి	రూ. 3000
పథకం అమలు కాక నిరుద్యోగులు ఐదునెలలకు నష్టపోయిన మొత్తం	రూ.892.56 కోట్లు



మెగా డీఎస్సీ పేరుతో కాలయాపన

నిరుద్యోగ భృతి అటుంచితే ప్రమాణ స్వీకారం రోజున మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తొలిసంతకం చేశారు. కూటమి సర్కార్ ఇప్పటి వరకు డీఎస్సీ నిర్వహించకుండా కాలయాపన చేస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2,645 ఉపాధ్యాయ పోస్టులు ఉండగా 40 వేల మందికి పైగా బీఎడ్, డీఎడ్ అభ్యర్థులు నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారు. తొలి సంతకాన్ని నమ్మి అభ్యర్థులు కర్నూలు, హైదరాబాద్, అవనిగడ్డ, నెల్లూరు, విజయవాడ తదితర ప్రాంతాల్లో కోచింగ్ తీసుకుంటున్నారు. ఇందుకు వేలాది రూపాయలు ఖర్చవుతుండటంతో కొందరు అప్పులు చేశారు. అయితే, ప్రభుత్వం టెట్‌తో సరిపెట్టి ఇప్పటి వరకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయకుండా వాయిదాల మీద వాయిదా వేస్తుండటంతో వారంతా దిగాలు చెందుతున్నారు. ఇతర ఉద్యోగాల భర్తీకి సంబంధించి కూడా ఇప్పటి వరకు సర్కారు స్పష్టమైన ప్రకటన చేయలేదు. కనీసం ఎన్నికల హామీ మేరకు ఉద్యోగం వచ్చే వరకు నెలకు రూ. 3వేలు నిరుద్యోగ భృతి ఇవ్వాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

నెలకు రూ. 3వేలు ఇవ్వాలి



ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్ ప్రకటించి వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలి. ఉద్యోగం వచ్చే వరకు ప్రతి నిరుద్యోగికి నెలకు రూ. 3వేలు భృతి ఇవ్వాలి. జిల్లాలో లక్షలాది మంది చదువుకొని ఉద్యోగాలు లేక వ్యవసాయ, ఉపాధి పనులకు వెళుతున్నారు. కూటమి నాయకులు ఎన్నికల ముందు ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీని తక్షణం అమలు చేయాలి.

– దేవరాజు, నిరుద్యోగ జేఏసీ నాయకుడు, కోవెలకుంట్ల

868.80 అడుగులుగా శ్రీశైల డ్యాం నీటిమట్టం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైల జలాశయ నీటిమట్టం మంగళవారం సాయంత్రం సమయానికి 868.80 అడుగులకు చేరింది. జలాశయానికి వరద ప్రవాహం నిలిచిపోయింది. 136.6026 టీఎంసీల నీరు నిల్వ ఉంది. సోమవారం నుంచి మంగళవారం వరకు సుంకేసుల నుంచి 2,013 క్యూసెక్కుల నీరు శ్రీశైలానికి వచ్చి చేరింది. శ్రీశైలం నుంచి దిగువ ప్రాజెక్టలకు 45,339 క్యూసెక్కుల నీరు విడుదలైంది. ఎడమ గట్టు కేంద్రంలో 15.298 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు.

ఈవీఎంలపై విమర్శలు చేయొద్దు

నంద్యాల: ఈవీఎంల ట్యాంపరింగ్‌పై కేఏ పాల్ అనే వ్యక్తి వేసిన పిటిషన్‌ను మంగళవారం సుప్రీం కోర్టు కొట్టి వేసిందని, ఈ మేరకు జిల్లా కేంద్రానికి ఉత్తర్వులు అందాయని జిల్లా కలెక్టర్ రాజకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో ఇక నుంచి ఈవీఎంల విశ్వసనీయతపై విమర్శలు చేయరాదన్నారు.

శాస్త్రోక్తంగా ఏకాదశి ఉత్సవం



ఉత్సవమూర్తులకు తిరుమంజనం నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలం లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఏకాదశిని పురస్కరించుకుని మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున మూలమూర్తులను సుప్రభాతసేవతో మేలుకొలిపి దివ్యదర్శనం కల్పించారు. అనంతరం ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాములను ఆలయ ముఖద్వార మండపంలో కొలువుంచి పంచామృతాలతో అభిషేకించి , వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య దూపదీపాలతో మహా మంగళహారతి నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవార్లు పల్లకీపై కొలువుదీరి తిరువీధిలో విహరించారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

- భారత రాజ్యాంగ దినోత్సవంలో మాజీ ఎంపీ పోచా, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

నంద్యాల(అర్బన్): ప్రజాస్వామ్య పరిరక్షణకు దిక్సూచి అయిన భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందామని మాజీ ఎంపీ పోచాబ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా పిలుపునిచ్చారు. ప్రపంచంలోనే అత్యుత్తమ లిఖిత రాజ్యాంగాన్ని అందించిన మహోన్నత వ్యక్తి డా.బీఆర్ అంబేడ్కర్ అని అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని బొమ్మలసత్రం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి మాజీ ఎంపీ పోచా, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసాతో పాటు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ దేశంలో ప్రతి పౌరుడికి స్వేచ్ఛ, సమానత్వం, హక్కులు కల్పించే విధంగా అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించారన్నారు. దీనిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు పాంషావలి, గంగిశెట్టి శ్రీధర్, నాయకులు కల్లూరి రామలింగారెడ్డి, చంద్రశేఖర్, ఆరిఫ్‌నాయక్, సమ్మద్ పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన

- లా అండ్ ఆర్డర్ గాడి తప్పింది
- ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారు
- అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం అమలు కావడం లేదు
- కూటమి సర్కారుపై వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని ధ్వజం
- తనపై కబ్జా ఆరోపణలను నిరూపించాలని సవాల్



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని పక్కనపెట్టి రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలనను సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాణ్యం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంబంధం లేని కేసులను రాజకీయ నాయకులకు అంటగడుతూ పబ్బం గడుపుకుంటుందన్నారు. రాష్ట్రంలో పోలీసులు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారన్నారు. మూడేళ్ల క్రితం సోషల్ మీడియాలో పోస్టు ఫార్వర్డ్ చేసిన వ్యక్తులపై కక్షగట్టి అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఇచ్ఛాపురం నుంచి అనంతపురం వరకు నేరాలు , అక్రమ వసూళ్లు, దందాలు, వేధింపులు, మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయన్నారు. అధికారంలోకి వచ్చి ఆరునెలలైనా ప్రజలకు జరిగిన మేలు శూన్యమన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం శాంతి భద్రతలు క్షీణించాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు ముఖ్యంగా బాలికలు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు.

సామాన్యుడిపై నిత్యావసరాల భారం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర సరుకులు ధరలు ఆకాశాన్నంటుతున్నాయని కాటసాని అన్నారు. సామాన్యుడికి రోజు గడవడం భారంగా మారిందన్నారు. అధిక ధరలతో మూడుపూటలా భోజనం చేయలేని పరిస్థితి అన్నారు. గతంలో లీటర్ మంచి నూనె ప్యాకెట్ రూ. 110 ఉంటే ఎల్లోమీడియా, అప్పటి ప్రతిపక్ష టీడీపీ నాయకులు గగ్గోలు పెట్టారన్నారు. ఇప్పుడు అదే నూనె ప్యాకెట్ ధర రూ. 150పైగా ఉందన్నారు. దీనిపై నాడు ప్రశ్నించిన ఎల్లో మీడియా నేడు నోరెత్తడం లేదన్నారు.

రైతులకు మద్దతు ధర ఎక్కడ?

రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని, పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు అల్లాడిపోతున్నారని కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు పంట పెట్టుబడికి ఇస్తామన్న రూ. 20 వేలు కూడా ఇప్పటి వరకు కూటమి సర్కారు రైతులకు ఇవ్వలేదన్నారు. అధికారం కోసం కూటమి నాయకులు మాయ మాటలు చెప్పి అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నికల ప్రతి హామీ అమలైందని, రైతులకు ఏటా రైతుభరోసా కింద సాయం అందిందన్నారు. రాయలసీమకే తలమానికమైన గోరుకల్లు జలాశయం కట్ట కుంగిపోతే యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టామని..దాని ఫలితమే ప్రస్తుతం రిజర్వాయర్‌లో పది టీఎంసీల నీరు నిల్వ చేసుకునేందుకు అవకాశం వచ్చిందన్నారు.

కబ్జా చేసింటే నిరూపించాలి

తనపై భూ కబ్జా ఆరోపణలు చేసే వారు దమ్ముంటే నిరూపించాలని మాజీ ఎమ్మెల్యే కాటసాని సవాల్ విసిరారు. అధికారంలో మీ ప్రభుత్వం ఉంది కదా విచారణ జరపాలని టీడీపీ నాయకులకు డిమాండ్ చేశారు. చేతిలో ఎల్లో మీడియా ఉంది కాదా అని ఇష్టమొచ్చినట్లు దుష్ప్రచారం చేయరాదన్నారు. పాణ్యం నియోజకవర్గంలో టీడీపీ నాయకుల ఆగడాలు పెరిగిపోయాయని, కాంట్రాక్టర్‌లను సైతం బెదిరిస్తున్నారన్నారు. అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. దీనిపై ప్రశ్నిస్తే నోటీసులు ఇవ్వడం, కేసులు నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, సర్పంచ్ మేకల పల్లవి, నాయకులు కరుణాకర్‌రెడ్డి, సుబ్బరాయుడు, జయచంద్రారెడ్డి, ఎంపీటీసీ రవిరెడ్డి, కో– ఆప్షన్ సభ్యులు జాకీర్ ఉసేన్, ఉసేన్‌బాషా, ప్రతాప్‌రెడ్డి , క్రిష్ణారెడ్డి, శేషయ్య, సత్యాలు, బొజ్జన్న, సర్పంచ్ రామచంద్రుడు, గోరుకల్లు సుబ్బారెడ్డి, ఎల్లగౌడ్, రాముడు, అనుపూర్ శ్రీనివాసులు, గగ్గటూరు శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి



స్టోర్ రూంలో కిరాణ సరుకులను పరిశీలిస్తున్న న్యాయమూర్తులు

డోన్ టౌన్: ఖైదీలు జైళ్లలో సత్ప్రవర్తనతో మెలగాలని కర్నూల్ డిస్ట్రిక్ లీగల్ సర్వీసు అథారిటీ సెక్రెటరీ, న్యాయమూర్తి బి.లీలావెంకట శేషాద్రి సూచించారు. మంగళవారం డోన్ సబ్ జైలును ఆకస్మిక తనిఖీ చేశారు. ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాధితులకు ఉచిత న్యాయసేవలు అందిస్తున్నామని, అవసరమైన వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి తంగమణి, ప్రిన్స్‌పల్ జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేద్కర్,లీగల్ అడ్వయిజర్ న్యాయవాది మాధవస్వామి, సబ్ జైలు సూపరింటెండెంట్ రఘునాథరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

‘పది’లో ఉత్తీర్ణత శాతం పెంచాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఈఓ

బనగానపల్లె రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో ఈసారి పదోతరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం బనగానపల్లెలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. తర్వాత రామక్రిష్టాపురం గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు స్వరూప, శ్రీనివాసులు, హెచ్ఎంలు బాలగంగధర్‌రెడ్డి, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

సేవలకు దక్కని గుర్తింపు

- జిల్లాలో ఆర్‌బీకేల ద్వారా రైతులకు వ్యవసాయ సిబ్బంది సేవలు
- కొందరికే పదోన్నతులు కల్పించిన సర్కారు
- ఏళ్లు గడుస్తున్నా కొందరు ఏఈఓలుగానే కొనసాగింపు
- ఎంపీఈఓలకు కరువైన ఉద్యోగ భద్రత



ఎం.కృష్ణాపురంలో ఏర్పాటు చేసిన ఆర్‌బీకే

గోస్పాడు: వ్యవసాయశాఖలో ఏళ్లతరబడిగా పనిచేస్తూ క్షేత్రస్థాయిలో రైతులకు సేవలందిస్తున్న ఉద్యోగుల్లో కొందరు ఉద్యోగ భద్రత లేక..మరికొందరు పదోన్నతులు దక్కక ఆందోళన చెందుతున్నారు. రైతులకు అవసరమైన అన్ని రకాల సేవలను స్థానికంగానే అందించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఊరూరా రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. దీంతో విత్తనాలు, ఎరువులు తదితర వాటికి రైతులు మండల కేంద్రాలకు వెళ్లే బాధ తప్పింది. ఈ కార్యాలయాల్లో పనిచేసే వీఏఏలు ఎప్పుడూ రైతులకు అందుబాటులో ఉండి వారికి కావాల్సిన సేవలు అందిస్తున్నారు. అయితే, ఈ వ్యవస్థపై అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ నేతలు ఎన్నో విమర్శలు చేశారు. అందులో పని చేసే వారివి ఉద్యోగాలే కాదంటూ అవహేళన చేశారు.

కొందరికే పదోన్నతులు

జిల్లాలో 411 రైతు భరోసా కేంద్రాల్లో 261 మంది వీఏఏలుగా పని చేస్తున్నారు. అయితే,వీరిలో 27 మందికి రాత పరీక్షలో ప్రతిభాధారంగా ఇటీవల ప్రభుత్వం ఏఈఓ గ్రేడ్–2లుగా పదోన్నతి కల్పించింది. అయితే, ఎప్పటి నుంచి వీఏఏల మాదిరిగా రైతులకు సేవలందిస్తూ కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఎంపీఈఓలను రెగ్యులర్ చేయలేదు. అలాగే ఏఈఓలుగా విధులు నిర్వహిస్తున్న వారికి పదోన్నతులు కల్పించలేదు. జిల్లాలో 60 మంది దాకా ఏఈఓలు పనిచేస్తున్నారు. వీరిలో ఎక్కువ సర్వీసు పూర్తి చేసుకున్న వారు కూడా ఇప్పటికే అదే స్థాయి పోస్టుల్లో కొనసాగుతుండగా మరికొందరు చేరినప్పుడు ఉన్న హోదాలోనే ఉద్యోగ విరమణ పొందాల్సిన పరిస్థితి. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని ఏఈఓలు కోరుతున్నారు.

మాకు ప్రమోషన్లు లేవు

ఏఈఓగా 12 సంవత్సరాల నుంచి విధులు నిర్వహిస్తున్నాను. ప్రస్తుతం డిప్లొమో అగ్రికల్చర్ చేసి 5 సంవత్సరాల అనుభవం ఉన్న వారు వీఏఏ స్థాయి నుంచి ఏఈఓలుగా పదోన్నతి పొందారు. ప్రారంభం నుంచి ఏఈఓలుగా విధులు నిర్వహిస్తున్న మాకు పదోన్నతే లేదు. అగ్రికల్చర్ డిప్లొమో, అగ్రికల్చర్ ఎమ్మెస్సీ చదివి కూడా సర్వీసు అంతా ఒకే స్థానంలో కొనసాగించాల్సి వస్తుంది. – మనోహర్, ఏఈఓల సంఘం ఉమ్మడి జిల్లా జనరల్ సెక్రటరీ, నంద్యాల

సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి

వెలుగోడు: రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నాణ్యమైన దిగుబడిని సాధించాలని జిల్లా వ్యవసాయ అధికారి వైవీ మురళీకృష్ణ అన్నారు. మండలంలోని అబ్దుల్లాపురం గ్రామంలో ఏఓ పవన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటించాలన్నారు. దీని వల్ల నాణ్యమైన దిగుబడితో పాటు నేలలో కర్బన శాతం, సూక్ష్మ పోషకాలు పెరుగుతాయని తెలిపారు. రైతులు ఎప్పుడు ఒకే పంట వేయకూడదని, పంట మార్పిడి చేయాలన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టరు జోత్స్న, సెరికల్చర్ టెక్నికల్ ఆఫీసర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై దాడి

పాణ్యం : టీడీపీ నాయకులు బరితెగించారు.నచ్చనివారిపై దాడులు, దౌర్జన్యాలతో చెలరేగిపోతున్నారు.తాజాగా మండల పరిధిలోని గగ్గటూరు గ్రామంలో ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ముల్లా ఉసేన్‌బాషాపై ఆదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కర్రలు, రాడ్లతో దాడికి పాల్పడ్డారు. ఈనెల 27న సామాజిక బహిరంగ సభ ఉండడంతో గ్రామాల్లో సోషల్ ఆడిట్ సిబ్బంది పర్యటించి సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఇప్పుడు తమ పార్టీ అధికారంలో ఉందని ఫీల్డ్ అసిస్టెంట్ విధుల నుంచి తప్పుకోవాలని సభ వద్దే అందరి ముందు టీడీపీకి నాయకులు ముల్లా ఉసేన్ బాషాతో గొడవకు దిగారు. ఈ క్రమంలో ఆపార్టీకి చెందిన 8 మంది ఫీల్డ్ అసిస్టెంట్‌తో పాటు మరో వ్యక్తిపై కర్రలు, ఇనుపరాడ్లతో దాడి చేశారు. ఈ ఘటనపై బాధితుడు ముల్లా ఉసేన్‌బాషా మంగళవారం కుటుంబసభ్యులతో కలిసి పాణ్యం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

క్లుప్తంగా

కొండ చిలువ హల్‌చల్



ఉయ్యాలవాడ: స్థానిక బీసీ కాలనీలో సోమవారం రాత్రి కొండ చిలువ హల్‌చల్ చేసింది. కార్తీక మాసం కావడంతో రాత్రి వివిధ ఆలయాల్లో భజన కార్యక్రమాన్ని ముగించుకుని భక్తులు గృహాలకు చేరుకునే సమయంలో బీసీ కాలనీలో కొండ చిలువ కనిపించింది. రహదారిపై నుంచి ఓ ఇంట్లోకి ప్రవేశిస్తుండగా స్థానికులు గుర్తించి ప్లాస్టిక్ డ్రమ్ముతో పట్టుకుని ఆటోలో తీసుకెళ్లి కుందూనదిలో వదిలారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

మంత్రాలయం: బూదూరు పంపుహౌస్ తుంగభద్రనది తీరం వద్ద 10 మంది పేకాటరాయుళ్లను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ రామంజులు, ఎస్ఐ పరమేష్‌నాయక్ తెలిపిన వివరాలు.. ఆదోనికి చెందిన తిమ్మయ్య, హుస్సేన్, వీరేష్, గంగన్న, బసప్ప ఎమ్మిగనూరుకు చెందిన ఆనంద్, రామకృష్ణ కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌కు చెందిన మల్లేష్, సూగూరు రెడ్డి, బసన్నగౌడ్‌లతోపాటు మరికొంత మంది పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి సోదాలు నిర్వహించి 10 మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.1.28 లక్షల నగదు, 5 బైకులు, 9 సెల్‌ఫోన్లు సీజ్ చేశారు. పరారైన మరికొంతమందిని త్వరలోనే పట్టుకుంటామని సీఐ తెలిపారు. ఎక్కడైనా మద్యం అమ్మకాలు, పేకాట నిర్వహణ జరుగుతుంటే 9121101151, 9121101152 నంబర్లకు సమాచారం ఇవ్వాలని వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

మిర్చి దిగుబడులకు నిప్పు

ఎమ్మిగనూరు రూరల్: ఆరుగాలం కష్టించి పండించిన మిర్చి దిగుబడులకు గుర్తు తెలియని దుండగు లు నిప్పుపెట్టడంతో బాధిత రైతు గుండెలు బాదుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలోని ఎర్రకోట గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసులు మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని మిరప సాగు చేశాడు. పెట్టుబడి, కూలీల ఖర్చులకు దాదాపు రూ.3 లక్షలు ఖర్చు చేశాడు. ఇటీవల కోత కోసి కల్లంలో 15 క్వింటాళ్ల దిగుబడులు ఆరబెట్టుకున్నాడు. మరో మూడు రోజుల్లో గుంటూరు మార్కెట్‌కు తరలించాలని నిర్ణయించుకున్నాడు. కాగా సోమవా రం అర్ధ రాత్రి గుర్తు తెలియని దుండుగులు దిగుబడులకు నిప్పంటించారు. మంటలు ఎగిసిపడుతుంటంతో పొలం పక్కన రైతులు శ్రీనివాసులకు సమాచారం అందించారు. మంటలు ఆర్పేందుకు రైతులు ఎంత ప్రయత్నించినా ప్రయోజనం లేకుండా పోయింది. మంటల్లో పూర్తిగా మిరప కాలి బూడిదైంది. దాదాపు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. మంగళవారం ఉదయం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రైతు తెలిపారు.

సీసీ టీవీ రిపేరీలో శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గ్రామీణ యువకులకు కెనరా బ్యాంక్, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ సీసీ టీవీ–కెమెరా అమరిక, రిపేరిలో డిసెంబరు 7 నుంచి 13 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ పుష్పక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18 నుంచి 45 ఏళ్ల లోపు వయస్సు ఉండి చదవడం, రాయడం వచ్చిన వారు అర్హులన్నారు. ఉచిత భోజనం, హాస్టల్ వసతి ఉంటుందని, ఆసక్తి ఉన్న యువకులు నాలుగు ఫొటోలు,రేషన్, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా, విద్యార్హత ధ్రువపత్రాల నకళ్లతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9000710508 సంప్రదించవచ్చన్నారు.

చలి.. చంపేస్తోంది!

- ముమ్మరంగా శీతల గాలులు
- చీకటి పడగానే చల్లగా మారుతున్న వాతావరణం
- జిల్లాలో 15 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు
- ఫ్లూ, జ్వరాలతో ప్రజలు సతమతం



చలి కాచుకుంటున్న దృశ్యం

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో మొన్నటి వరకు అలస్యం అయ్యిందనుకున్న శీతాకాలం ఎట్టకేలకు వచ్చేసింది. వచ్చీరాగానే శీతల గాలులు వీస్తోంది. సాయంత్రం అయ్యిందంటే చాలు వాతావరణం చల్లగా మారిపోతోంది. రాత్రి గడిచేకొద్దీ మరింత చల్లగా మారి జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ సమయంలో బయటకు రావాలంటేనే జనం జంకుతున్నారు. వెచ్చదనం కోసం తపించిపోతున్నారు. జిల్లాలో చలిపులి భయపెడుతోంది. మొన్నటి వరకు కార్తీకమాసం ప్రారంభమైనా ఇంకా చలి ప్రారంభం కాలేదని అందరూ అనుకున్నారు. కార్తీక మాసం వచ్చి పక్షం రోజులు గడిచిపోయాక శీతల గాలులు ప్రారంభమయ్యాయి. సాయంత్రం 6 నుంచి ఉదయం 8 గంటల వరకు చలి తీవ్రత ఎక్కువగా ఉంటోంది. కర్నూలు,కోడుమూరు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు, మంత్రాలయం ఇలా అన్ని చోట్లా శీతలగాలులు వీస్తున్నాయి. వ్యవసాయ భూములుండే గ్రామీణ ప్రాంతాల్లో చలి ప్రభావం మరింత ఎక్కువగా ఉంది. ఈ క్రమంలో చలి కారణంగా ప్రజలు జలుబు, జ్వరం, దగ్గు బారిన పడుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.చాలా మంది శ్వాసనాళాలు మూసుకుపోయి ఊపిరాడక ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇదే సమయంలో ఒకరకమైన ఇన్‌ఫ్లూయెంజా వైరస్ కూడా ఈ సీజన్‌లో వచ్చే అవకాశం ఉందని వైద్యు లు హెచ్చరిస్తున్నారు. శీతల గాలుల నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు.

ఆసుపత్రులకు పెరిగిన రోగులు

వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో ఆసుపత్రులకు రోగులకు సంఖ్య పెరుగుతోంది. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఊపిరితిత్తుల విభాగానికి గతంలో ప్రతి బుధ, శని వారాలు ఓపీ ఉండేది. ప్రస్తుతం ప్రతిరోజూ 50కి పైగా రోగు లు వస్తుండగా, గత మూడు రోజుల నుంచి రోగుల సంఖ్య 60 దాటుతోంది. అలాగే ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లల్లో జనరల్ ఫిజీషియన్లు, కార్డియాలజిస్టులు, పల్మనాలజిస్టుల వద్ద కూడా రోగుల సంఖ్య 30 శాతం పెరిగినట్లు వైద్యులు చెబుతున్నారు.

దీర్ఘకాలిక రోగులూ జాగ్రత్త

చలికాలంలో శీతల గాలులు వీస్తున్న వేళ దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. మధుమేహం, బీపీ, థైరాయిడ్, ఆస్తమా, సీఓపీడీతో బాధపడేవారు దగ్గు, జలుబు, ఆయాసం వస్తే అశ్రద్ధ చేయకుండా వైద్యులను కలిసి వారి పరిస్థితిని వివరించి చికిత్స తీసుకోవాలి. వీరు చలి కాలంలో ఉదయం వేళ మంచుకురుసే సమయంలో వాకింగ్‌కు వెళ్లకపోవడమే మంచిదని వైద్యులు చెబుతున్నారు.

ఊపిరితిత్తుల సమస్యలున్న వారు జాగ్రత్త



చలికాలంలో టీబీ, సీవోపీడీ, ఆస్తమా రోగులు చాలా జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా వీరు చలికి తిరగకూడదు. ఉదయం వాకింగ్ పూర్తిగా మానేయాలి. వేడి పదార్థాలను తీసుకోవాలి. వేడిగా ఉన్న ద్రవపదార్థాలను తాగాలి. ముఖ్యంగా నీటిని ఎక్కువగా తాగాలి. నీళ్లు తక్కువగా తాకితే ఇరిటేషన్, దగ్గు వస్తుంది. సీజన్‌లో లభించే పండ్లు కూడా బాగా తినాలి. ఊపిరితిత్తుల సమస్యలున్న వారు మందులు దగ్గర ఉంచుకోవాలి. ఏదైనా ఇబ్బంది వస్తే వైద్యులను కలిసి చికిత్స తీసుకోవాలి.

– డాక్టర్ కె. వినోద్ ఆచారి, ఊపిరితిత్తుల వ్యాధుల నిపుణులు, కర్నూలు

పిల్లలకు వెచ్చదనాన్ని ఇవ్వాలి



శీతలగాలులు వీస్తున్న ఇలాంటి సమయంలో చిన్నపిల్లలకు వైరల్ ఇన్‌ఫెక్షన్లు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. ప్రధానంగా దగ్గు, ఆయాసంతో పాటు ఆస్తమా వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఈ సమయంలో జలుబు, జ్వరం, తలనొప్పి, కళ్లు మంటలు, ఒళ్లు నొప్పులు మొదలైన లక్షణాలు వారిలో కనిపిస్తాయి. ఇలాంటి సమయంలో పిల్లలకు తగిన విశ్రాంతి ఇవ్వాలి. వెచ్చదనాన్ని ఇవ్వాలి. ఈ సీజన్‌లో పిల్లలు చలిగాలికి ప్రభావితం గాకుండా జాగ్రత్త పడాలి. ద్రవపదార్థాలను ఎక్కువగా ఇవ్వాలి. వైద్యుల సూచన మేరకు మందులు వాడాలి.

– డాక్టర్ అమరనాథ్‌రెడ్డి, చిన్నపిల్లల వైద్యులు, కర్నూలు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



రమేష్(ఫైల్)

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని పెట్నికోటలో ఓ వ్యక్తి మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన పామిడి రమేష్(40) లారీలకు నాపరాళ్ల లోడింగ్ పనులకు వెళ్లేవాడు. ఏడాది క్రితం కల్వటాల సమీపంలో బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇటీవల కోలుకున్నాడు. రోజు మాదిరిగానే పనికి వెళ్లి ఇంటికి చేరుకొని నిద్రకు ఉపక్రమించాడు. తెల్లవారే సరికి విగతజీవిగా మారాడు. గుండె పోటుతో మృతి చెందాడని భార్య పామిడి రమాదేవి చెబుతుండగా గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న సీఐ రమేష్‌బాబు గ్రామానికి చేరుకొని మృతదేహంతోపాటు ఇంటి పరిసరాలను పరిశీలించారు. అనంతపురం జిల్లా పుట్లూరుకు చెందిన ఓ వ్యక్తితో కలిసి భార్యే భర్తను హత్య చేసినట్లు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తుండటంతో పోలీసులు ఆ దిశగా విచారణ చేస్తున్నారు. మృతుడి సోదరి గూటం రమాదేవి ఫిర్యాదు మేరకు అనుమానాస్పదంగా మృతి చెందినట్లు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నామని సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవుకు సీహెచ్‌సీకి తరలించారు. మృతుడికి భార్యతోపాటు కొడుకు, కూతురు ఉన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

- కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ పిలుపు



కర్నూలులో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు, కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ పిలుపునిచ్చారు. పీఎం మోదీ, సీఎం చంద్రబాబు కార్మిక, కర్షకుల వ్యతిరేకులంటూ మండిపడ్డారు. మంగళవారం కేంద్ర కార్మిక, కర్షక సంఘాల పిలుపు మేరకు కర్నూలు నగరంలో జెడ్పీ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట మోదీ, చంద్రబాబులకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తంచేశారు. ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా కార్యదర్శులు ఎస్.మునెప్ప, ఎండీ అంజిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో గఫూర్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. ఎన్నో త్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మికులను బానిసల్లాగా మార్చారని దుయ్యబట్టారు. పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు తీసుకొచ్చి ఈజ్ ఆఫ్ డూయింగ్ అంటూ వారికి అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్న ప్రభుత్వం కార్మికుల గోడు పట్టించుకోవడం లేదని విమర్శించారు. 375 రోజులు కొనసాగిన రైతు ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో మోదీ విఫలమయ్యారన్నారు. ఎంఎస్ స్వామినాథన్ సిఫారసులను అమలుచేయాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు అవసరమైన చట్టాన్ని పార్లమెంట్‌లో ఆమోదించాలని డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం ప్రతి రైతుకు రూ.20 వేల పెట్టుబడి డబ్బు ఇవ్వాలని, పంటలను కనీసం మద్దతు ధరతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి జే లలితమ్మ మాట్లాడుతూ ఆశావర్కర్లు, అంగన్‌వాడీలకు వేతాలను పెంపుతోపాటు ఇతర సమస్యలను పరిష్కరిస్తామని సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వృత్తిదారుల సంఘం రాష్ట్ర నాయకులు రామాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నారాయణ, ఏఐకేఎస్ నాయకులు మల్లికార్జున, టీయూసీఐ నాయకులు తిరుపాలు, ఐఎన్‌టీసీ నాయకులు సుంకన్న మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. నిత్యావసరాల ధరలు పెరిగిపోతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, నాయకులు నరసింహులు,సాయిబాబ, అబ్దుల్‌దేశాయ్,విజయ్ రాముడు,రాజశేఖర్, ఏఐటీయూసీ నాయకులు చంద్రశేఖర్, వెంకటేష్, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు సీజ్

- రూ.2.67 లక్షల జరిమానా
- మూడున్నర గంటల పాటు పిల్లాపాపలతో తీవ్ర ఇబ్బందులు పడిన నేపాల్ ప్రయాణికులు





బస్సును సీజ్ చేయడంతో డోన్ బస్టాండ్‌లో నిరీక్షిస్తున్న నేపాల్ ప్రయాణికులు

డోన్ టౌన్: ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును సీజ్ చేయడంతో అందులోని నేపాలీ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భారీ జరిమానా చెల్లించడంతో దాదాపు మూడున్నర గంటల తర్వాత బస్సును రిలీజ్ చేయడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. ప్రయాణికులు తెలిపిన వివరాలు.. నేపాల్‌కు చెందిన దాదాపు 60 మంది బతుకు దెరువు కోసం నాగాలాండ్‌లో రాజస్తాన్ రిజిస్ట్రేషన్ డబుల్‌డెక్కర్ బస్సును అద్దెకు తీసుకుని రెండు రోజుల క్రితం బెంగళూరుకు బయలుదేరారు. మంగళవారం సాయంత్రం 6గంటలకు డోన్ వద్ద మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ తన సిబ్బందితో బస్సును తనిఖీ చేశారు. ఏపీ ట్యాక్స్ చెల్లించకుండా బస్సు నడుపుతున్నట్లు గుర్తించి రూ.2.67 లక్షల జరిమానా విధించారు. చెల్లించేందుకు అంత పెద్ద మొత్తం డ్రైవర్ వద్ద లేకపోవడంతో బస్సును ఆర్టీసీ డిపోకు తరలించారు. అందులోని ప్రయాణికులను డోన్ బస్టాండ్‌లో దించివేయడంతో వారికి దిక్కుతోచని స్థితి ఏర్పడింది. ప్రయాణికుల్లో చిన్నపిల్లలు ఉండటం, బస్టాండ్‌లో తాగునీరు లేకపోవడం, తినటానికి హోటల్ కూడా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. డ్రైవర్ ఎలాగోలా యాజమాన్యంతో మాట్లాడి, డబ్బు ట్రాన్స్‌ఫర్ చేయించుకుని జరిమానా చెల్లించి బస్సును రిలీజ్ చేయించుకునేలోపు రాత్రి 9.30 అయ్యింది. దాదాపు మూడున్నర గంటల పాటు ప్రయాణికులు నిరీక్షించాల్సి వచ్చింది.


రైల్వే ట్రాక్ వద్ద యువకుడి మృతదేహం



షేక్ షాబీర్(ఫైల్)

ఆదోని సెంట్రల్: నగరూర్–ఆస్పరి రైల్వే స్టేషన్ల మధ్యలో రైల్వే ట్రాక్ పక్కన ఓ యువకుడి మృతదేహం లభ్యమైంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని కార్వాన్‌పేటకు చెందిన ఖాజా హుసేన్ కుమారుడు షేక్ షాబీర్(31) బేల్దార్ పని చేసుకొని జీవనం సాగించేవాడు. మంగళవారం షేక్ షాబీర్ ఘటనా స్థలంలో విగత జీవిగా పడి ఉండటంతో స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించి తల్లిదండ్రులకు చేరవేశారు. రైలు నుంచి జారిపడ్డాడా, లేక రైలు ఢీకొని మృతి చెందాడా అనే విషయాలు విచారణలో తెలియాల్సి ఉంది. మృతుడికి భార్య అమినాబీ, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

కోలుకోలేక వృద్ధురాలి మృతి



నారాయణమ్మ(ఫైల్)

చాగలమర్రి: గీజర్ పేలి గాయపడిన ఓ వృద్ధురాలు కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతి చెందింది. ఎస్ఐ రమేష్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని చిన్నవంగలి గ్రామానికి చెందిన బాపతి నారాయణమ్మ (61) ఈనెల 12న బాత్రూంలో స్నానం చేస్తుండగా గీజర్ పేలి మంటలు వ్యాపించటంతో తీవ్రంగా గాయపడింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించటంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నాటుసారా బట్టీలు ధ్వంసం

- ముగ్గురు విక్రయదారుల అరెస్టు



సారా తయారీకి వినియోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

కర్నూలు: స్థానిక బంగారుపేట శివారులోని కేసీ కెనాల్ గట్టుపై నాటుసారా స్థావరాలను ఎక్సైజ్ పోలీసులు ధ్వంసం చేశారు. సీఐలు రాజేంద్రప్రసాద్, చంద్రహాస్, కృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది బృందాలుగా ఏర్పడి మంగళవారం ఉదయం బంగారుపేటలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. కేసీ కెనాల్ గట్టు వెంట ఉన్న బట్టీలు ధ్వంసం చేసి సారా తయారీకి వినియోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. 2,700 లీటర్ల బెల్లం ఊట, 85 లీటర్ల నాటుసారా ధ్వంసం చేసి సారా విక్రయాలు జరుపుతున్న బంగారుపేట ఎం.కన్య, దిన్నెదేవరపాడు బోయ మద్దమ్మ, బుధవారపేట బోయ సుధాకర్‌బాబులను అరెస్టు చేసి జైలుకు పంపినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.